క్లుప్తంగా

రైతు సంక్షేమమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గీత

ప్రత్తిపాడురూరల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని రాచపల్లిలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మశ్రీను, వైస్ చైర్మన్ శేరు కృష్ణ, కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాతో ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఏఎంసీ పాలక వర్గం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలన్నారు. తమ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతుల చెంతకే సేవలు చేర్చిందన్నారు. రైతులను అన్ని విధాలా తమ ప్రభుత్వం బలోపేతం చేసిందన్నారు. ఆర్బీకేల ద్వారా విత్తనాల నుంచి పంట కొనుగోలు వరకు అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు పర్వత రాజుబాబు, గోళ్ల కాంతి సుధాకర్, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఏలేశ్వరం మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య, సొసైటీ చైర్మన్‌లు గొంతిన సురేష్, చక్కపల్లి సత్తిబాబు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దలే చిట్టిబాబు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద పెద్దాపురం ఆటో స్టాండ్‌కు చెందిన ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వాతావరణంలో వేడి ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు మజ్జిగ తాగడానికి పోటీ పడ్డారు. దీనికి తోడు హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ స్టేషన్ సెంటర్ మీదుగా వెళ్లడంతో మజ్జిగ చలివేంద్రానికి మంచి స్పందన లభించింది.


అఖిల భారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయండి



వారపు సంతలో ప్రచారం నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

పెద్దాపురం: ఈ నెల 21న విశాఖపట్టణంలో నిర్వహించే అఖిల భారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు పిలుపునిచ్చారు. పెద్దాపురం వారపు సంతలో ఆదివారం అఖిల భారత ఆదివాసీ సదస్సుపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశాఖపట్టణం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సదస్సుకు ఆదివాసీలందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వారపు సంతలో కరపత్రాలు పంపిణీ చేస్తూ సదస్సుపై విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గెద్దాడ సూరిబాబు, కిలాని బాబురావు, కర్నాకుల రామలింగేశ్వరరావు, బి.గోపు, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తలుపులమ్మతల్లి జాతర



మజ్జిగ పంపిణీ చేస్తున్న అక్షర గ్రూపు సేవాసంస్థ ప్రతినిధులు

కోటనందూరు: స్థానిక తుని–నర్సీపట్నం రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీతలుపులమ్మతల్లి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ బాణసంచా కాల్పులు అందరినీ ఆకట్టుకున్నాయి.

మజ్జిగ పంపిణీ

తలుపులమ్మతల్లి జాతర సందర్భంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ వేడి, వడగాడ్పులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో స్థానిక అక్షర గ్రూప్ స్వచ్ఛంద సేవాసంస్థ, ఏవీఎం కోచింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, చల్లని మంచినీరు, పూజా సామగ్రి పంపిణీ చేశారు.

కార్మికులకు ఉపాధే లక్ష్యంగా..

- వృత్తి శిక్షణలకు నిలయంగా న్యాక్
- గృహ నిర్మాణ రంగం, సర్వేలో శిక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం



సామర్లకోటలో న్యాక్ శిక్షణ కేంద్రం



ఎలక్ట్రికల్ వర్కులో శిక్షణ ఇస్తున్న దృశ్యం

సామర్లకోట: గృహ నిర్మాణ రంగానికి అవసరమయ్యే వివిధ విభాగాల కార్మికులు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) సంస్థలో శిక్షణ పొంది ఉపాధి పొందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో ఈ సంస్థ నిర్వాహణ సాగుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ సంస్థ జిల్లాలోని సామర్లకోటలో ఉంది. ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఈ సంస్థ సర్టిఫికేట్లకు ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ప్రభుత్వ రంగాలల్లో జరిగే నిర్మాణాల్లో వీరికి సులభంగా ఉపాధి లభిస్తుంది. 2007లో సామర్లకోటలో ఏర్పాటు చేసిన ఈ సంస్థలో ఇప్పటి వరకు రెండు వేల మంది శిక్షణ పొంది ఉపాధి పొందుతున్నారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, మెషినరీ వంటి వాటిలో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి శిక్షణ పొందే వారికి భోజన, వసతి సౌకర్యంతో పాటు రోజుకు రూ.250 గౌరవ వేతనంగా చెల్లిస్తున్నారు. చదువు లేని వారికి మూడు నెలలు, చదువుకున్న వారికి 15 నుంచి నెల రోజులు శిక్షణ ఇస్తున్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణ..

పదో తరగతి అర్హత ఉంటే మూడు నెలల కాల పరిమితితో అసిస్టెంట్ సర్వేయర్‌కు శిక్షణ ఇటీవల ప్రారంభించారు. యూనిట్లు, కొలతలు, చైన్ సర్వే, కంపాస్ సర్వే, ప్లానీ టేబుల్ సర్వే, లెవెలింగ్, ఎలక్ట్రానిక్ టోటల్ సెక్షన్ (ఈటీఎస్) వంటి సాంకేతిక అంశాలతో సర్వేలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికేట్లు కలిగి ఉన్న వారికి ప్రైవేటు కంపెనీలల్లో ఉద్యోగాలు కల్పించే బాధ్యతను కూడా నేక్ తీసుకుంటోంది.

శిక్షణ ఎంతో సాయపడింది



నేక్ సంస్థలో శిక్షణ పొందే నాటికి ఎలక్ట్రికల్ రంగంలో ప్రైవేటుగా పనులు చేస్తున్నా. ఈ సంస్థలో 15 రోజుల పాటు పొందిన శిక్షణ ఎంతగానో ఉపయోగపడింది. అనేక కొత్త విషయాలు నేర్చుకున్నా. సంస్థ ఇచ్చే సర్టిఫికెట్ ఇతర రాష్ట్రాల్లో ఉపాధికి ఉపయోగపడుతుంది.

– జలతారు భానుతేజ, సామర్లకోట

ఉపాధికి ఊతం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే ఉపాధి శిక్షణలు నేక్ సంస్థ ద్వారా అందజేస్తాం. నిర్మాణ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి నేక్ ఏర్పాటు చేశాం. పనిలో నాణ్యతను నిర్ధారించడానికి, భద్రతను మెరుగు పరచడం లక్ష్యంగా నేక్ పని చేస్తోంది.

– జి.రాజు, ఫ్యాకల్టీ, నేక్, సామర్లకోట

నేటి నుంచి మెప్మా ఆర్పీల శిక్షణ

సామర్లకోట: మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి మెప్మాలో పని చేస్తున్న రిసోర్సుపర్సన్లకు రెండు రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా స్థానిక టీటీడీసీలో సోమ, మంగళవారాల్లో సామర్లకోట మున్సిపాలిటీ మెప్మాలో పని చేస్తున్న 43 మంది ఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నారు. 17, 18 తేదీల్లో తునిలో 40 మందికి, 19, 20 తేదీలల్లో పిఠాపురంలో 39 మందికి, 22, 23 తేదీల్లో రామచంద్రపురంలోని 36 మంది ఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నట్టు డీపీఎం మోహన్‌కుమార్ తెలిపారు. 24 నుంచి జూన్ ఒకటి వరకు కాకినాడ కార్పొరేషన్ నుంచి 209 మంది మెప్మా ఆర్పీలకు శిక్షణ ఉంటుందన్నారు.

ఘనంగా మేడే ఉత్సవాలు

పెద్దాపురం: మండలంలోని వడ్లమూరులో ఆదివారం క్వారీ లారీ యూనియన్ సంఘం అధ్యక్షుడు కిల్లాడి సూరిబాబు అధ్యక్షతన మేడే ఉత్సవాలు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, దాడి బేబి, నీలపాల సూరిబాబు, నూర్ జహాన్, ప్రసన్నకుమారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



27 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పిఠాపురం: ఎప్పుడో 27 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఇన్నేళ్ల తరువాత ఒక్కటయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధుర జ్ఞాపకాలను మళ్లీ తలుచుకుని పెద్ద వారందరూ చిన్న పిల్లల మాదిరిగా సంతోషంగా గడిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి హైస్కూలులో 1995–96 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే స్కూలులో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు దడాల వాడపల్లి, సూర్యనారాయణ మూర్తి, ఆకొండి లక్ష్మణమూర్తి, భారతి, గోకరకొండ నాగేశ్వరరావు, హిందీ మాస్టరులను ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించారు. వన్నెపూడి సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యం, మేలేటి గోపాలకృష్ణ, దాసం రాంబాబు పాల్గొన్నారు.

పార్టీలో యువతకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజల మనసులను దోచుకున్నారని, అందుకే ప్రతీ ఒక్కరూ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం కొడవలిలో ఆదివారం గ్రామానికి చెందిన యువకులు వైఎస్సార్ సీపీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో యువతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర యువజన విభాగం ద్వారా పార్టీలో యువతకు చోటు కల్పించి వారి సేవలను వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. విద్య ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుండడంతో యువత ఎక్కువగా పార్టీ వైపు మొగ్గు చూపుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో యువత పార్టీ గెలుపునకు కృషి చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొడవలి సర్పంచ్ నాగ రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు భగవాన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యువత పిల్లి లోవరాజు, పిల్లి రాంబాబు, పాలిక సురేష్, నొట్ల నాగు, కొప్పిశెట్టి వీరబాబు, బొందల వసంత, గంటా అప్పన్న, బుర్రా సోమరాజు, బుర్రా వెంకట్‌తో పాటు సుమారు 50 మంది యువకులు పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అన్ని వర్గాలకు మేలు చేసేదిగా ఉండడంతో ఆయన ఆధ్వర్యంలో ప్రజా సేవలో ఉండాలని తామంతా వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు పార్టీలో చేరిన యువకులు తెలిపారు.

సాగర తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ సాగర తీరం



బీచ్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

కొత్తపల్లి: రోజురోజుకూ ప్రచండభానుడు ఉగ్ర రూపం దాల్చడంతో ఎండవేడిమిని భరించలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి వెళ్తూ సేద తీరుతున్నారు. తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగరతీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు సహా పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు.

పారిశుధ్యమంటే ఇంత నిర్లక్ష్యమా?

- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఉప్పాడలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కొత్తపల్లి: ఉప్పాడ గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చేతలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్రధాన రహదారుల్లో మురుగునీరు నిలిచిపోతోంది. గ్రామంలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశుధ్యమంటే ఇంత నిర్లక్ష్యమా అంటూ ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. బయటకు రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏనాడూ గ్రామంలో దోమల నియంత్రణ మందు పిచికారీ చేసిన పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుధ్య నిర్లక్ష్యంతో అంటు రోగాలతో భయాందోళనకు గురవుతున్నారు.

ఘనంగా హనుమజ్జయంతి

- శోభాయాత్రను ప్రారంభించిన కమలానంద భారతి
- కాషాయం జెండాలతో నిండిన సామర్లకోట



సామర్లకోటలో సాగిన హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ



గొల్లప్రోలులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు తదితరులు



సామర్లకోట వీరాంజనేయస్వామి ఆలయంలో హోమం

సామర్లకోట: హనుమాన్ జయంతిని ఆదివారం వాడవాడలా భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ నగర్‌లోని 65 అడుగుల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలోను, స్టేషన్ సెంటర్‌లోని ఆలయంలోను, కోట్లమ్మ చెరువు వద్ద, రాజీవ్ గృహకల్ప వద్ద స్వామివారి ఆలయాల్లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గృహకల్ప వద్ద ఉన్న ఆంజనేయస్వామికి, కోట్లమ్మ చెరువు వద్ద ఆలయంలోను, స్టేషన్ సెంటర్‌లోని ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ శోభాయాత్ర నిర్వహించారు. గన్నవరం భువనేశ్వరీ పీఠానికి చెందిన కమలానందభారతి స్వామీజీ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణం అంతా. వీహెచ్‌పీ మండల స్థాయి నాయకులు కర్రి ఆదినారాయణరెడ్డి యార్లగడ్డ అక్కరాజు, జగన్నాథ్, జీవీకె మోహనరావు, కంచర్ల రామకృష్ణ, ఎం.వీరబాబు, పి ప్రభాకర్ అర్జునరావు ఈ బైక్ ర్యాలీని పర్యవేక్షించారు. సీఐలు అబ్దుల్ నబీ, కె. దుర్గాప్రసాద్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

కోట్లమ్మ చెరువు వద్ద హోమం

సామర్లకోట: స్థానిక కోట్లమ్మ చెరువు వద్ద వేంచేసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో సాయంత్రం హోమం నిర్వహించారు. ప్రపంచ శాంతి కోసం ఆలయంలో హోమం, హనుమాన్ చాలీసా పారాయణ, సుందరకాండ పారాయణలను నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త క్షత్రి రాజారాంసింగ్ తెలిపారు.

కొత్తపల్లి: మండలంలో హనుమజ్జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లి, ఉప్పాడ, గోర్స, కుతుకుడుమిల్లి, కొండెవరం తదితర గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

పిఠాపురం: హనుమజ్జయంతి సందర్భంగా పిఠాపురంలో కాకినాడ జిల్లా విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర వైభవంగా సాగింది. బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు డి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర పిఠాపురం పాదగయ క్షేత్రం నుంచి పట్టణ మంతా నిర్వహించారు. ఈ యాత్రలో జైశ్రీరామ్, జై హనుమాన్, హిందువుల ఐక్యత దేశానికి శ్రీరామ రక్ష నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదిపరాశక్తి పీఠాధిపతి నిత్యవిద్యానంద భారతి స్వామిజీ మాట్లాడుతూ దేశం సుభిక్షంగా ఉండాలని, భారతదేశం అఖండంగా వెలగాలని, హిందువులందరూ మన సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని పిలుపునిచ్చారు. పిఠాపురం మహా పుణ్య క్షేత్రాల నిలయమని, ఆధ్యాత్మిక కేంద్రమని, ఇటువంటి పుణ్యభూమిలో జన్మించిన వారందరూ ధన్యులని అన్నారు.

ఎమ్మెల్యే దొరబాబు ప్రత్యేక పూజలు

పిఠాపురం: నియోజకవర్గంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో గాంధీనగర్ కాలనీ, మెయిన్‌రోడ్డులో పెండెం పెద వీర రాఘవరావు బస్టాండ్ వద్ద, ఈబీసీకాలనీకొత్తపేట కాలనీలలో ఉన్న రామాంజనేయ ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని అన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మొగలి బాబ్జి, మొగలి అయ్యారావు, సచివాలయ కన్వీనర్ మొగలి సాంబశివరావు, పర్ల రాజా, గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు. పిఠాపురం మండలం పి. తిమ్మాపురం, బి.కొత్తూరు గ్రామాల్లో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం

మాజీ ఎంపీ తోట నరసింహం

గోకవరం/జగ్గంపేట: 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా బాధ్యతలు చేపడతారని మాజీ ఎంపీ తోట నరసింహం పేర్కొన్నారు. కుమారుడి వివాహం నిమిత్తం నియోజకవర్గంలోని జగ్గంపేట, గోకవరం మండలాల్లోని ఆత్మీయులు, రాజకీయ నాయకులను ఆహ్వానించేందుకు ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జగ్గంపేటలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సీఎంగా జగన్ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యారని, పని చేసే నాయకుడికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కారణంగానే రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి సీఎంగా జగన్ రెండోసారి బాధ్యతలు నిర్వహిస్తారని చెప్పారు. సీఎం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లాలన్నారు. తన గురించి మాట్లాడుతూ మూడేళ్లుగా అనారోగ్యం కారణంగా రాజకీయాలకు దూరంగా ఉన్నానన్నారు. 2004 నుంచి నియోజకవర్గ ప్రజలు తనను ఎంతో ఆదరించి తమ కుటుంబానికి అండగా ఉన్నారన్నారు. 2004, 2009లో ఎమ్మెల్యేగా, 2014లో ఎంపీగా బాధ్యతలు నిర్వహించానని, 2010 నుంచి 2014 వరకు మంత్రిగా పని చేశానన్నారు. తాను అధికారంలో ఉండగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో రూ.609 కోట్లతో తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం తీసుకువచ్చానన్నారు. పలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా సాగునీరందించామని, ఈ విధంగా నియోజకవర్గంలో సుమారు 85 వేల ఎకరాలకు పైగా సాగునీరు వచ్చేందుకు కృషి చేశానన్నారు. పోలవరం కాలువ నిర్మించే క్రమంలో నిష్పక్షపాతంగా భూసర్వే చేశామన్నారు. జగ్గంపేట మండలానికి తాగునీరు కూడా తీసుకువచ్చానన్నారు. జగ్గంపేటకు డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్ కూడా తన హయాంలోనే తీసుకువచ్చానన్నారు. ఎంపీగా ఉన్న కాలంలో నియోజకవర్గంలో సుమారు రూ.24 కోట్లు అభివృద్ధి పనులపై ఖర్చు చేసినట్టు చెప్పారు.

పొగమంచుతో కనిపించని రోడ్లు



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో పొగ మంచు

సామర్లకోట: వేసవి కాలంలో ఎండలు మండిపోతున్న తరుణంలో ఆదివారం తెల్లవారుజాము ఉదయం 8 గంటల వరకు పొగ మంచు దట్టంగా కమ్మేసింది. దాంతో రోడ్లపై ఎదుటి వాహనాలు కనిపించని విధంగా మారింది. దాంతో వాహనాల యజమానులు లైట్లు వేసుకొని వాహనాల రాకపోకలు సాగించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రోజూ మార్నింగ్ వాక్ చేసే వారికి పొగ మంచు అంతరాయంగా మారింది. దాంతో వాకర్లు ఇబ్బందులకు గురయ్యారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

తొండంగి: మండలంలోని నర్సిపేటకు చెందిన మహిళ విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై రవికుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నర్సిపేటకు చెందిన పోలవరపు నాగమణి(52) శనివారం ఇంటి వద్ద చేతిపంపు కొట్టేందుకు వెళ్లింది. విద్యుత్ మోటారు కూడా చేతిపంపునకు అమర్చి ఉండటంతో నాగమణి విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నాగమణి కుమారుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ వివరించారు.